ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 240    శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 పేజీలు 8  వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.




## ఎన్నారైలు మరింత శక్తిమంతం..
# ఈ సారి కూటమికి లక్.. !

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 10)

తాజాగా టీడీపీ ఎన్నారై.. కమిటీని నియమించింది. వాస్తవానికి.. ఎన్నారైలు.. ఆది నుంచి టీడీపీకి మద్దతు గానే ఉన్నా.. 2023లో చంద్రబాబు అరెస్టు అనంతరం.. ఒకేతాటిపైకి వచ్చారు. ఆయనకు అనుకూలంగా నిరసన చెప్పడంతో పాటు.. దేశ విదేశాల్లోని వారు.. ఏకమై.. నాడు చంద్రబాబుకు మద్దతుగా పోరాటాలు కూడా సాగించారు. అదేస్ఫూర్తిని గత ఎన్నికల్లోనూ చూపించారు. కూటమి సర్కారు విజయం దక్కించుకు నే విధంగా ఎన్నారైలు.. రంగంలోకి దిగి విస్తృత ప్రచారం చేశారు.ఎక్కడెక్కడ నుంచో సొంత నిధులు ఖర్చు చేసుకుని ఏపీకి వచ్చి.. గ్రామ గ్రామానా తిరిగారు. ఫలితంగా కూటమి విజయంలో ఎన్నారైల పాత్ర అమోఘమనే మాట వినిపించింది. ఇక, వచ్చే ఎన్నికలకు సంబం ధించి కూటమి ప్రభుత్వం పక్షాన టీడీపీ ఒక రకంగా ప్రపంచ దేశాల స్థాయిలో ఎన్నారై కమిటీని నియమిం చింది. -ఎన్నారై గ్లోబల్ టీడీపీ- కార్యవర్గంగా పిలుచుకునే ఈ కమిటీ.. 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయనుంది.అయితే.. గత ఎన్నారై కమిటీకి.. ప్రస్తుత కమిటీకి ▶2లో

## అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది డొనాల్డ్ ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 10)

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయని అంచనా వేశారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యూఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జీసీ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యూఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ▶2లో

# రివ్యూలు కాదు..
# రిజల్ట్స్ కావాలి
## అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని
కలెక్టర్లకు సీఎం స్పష్టీకరణ

ప్రో-యాక్టివ్‌గా పనిచేస్తూ, అభివృద్ధిలో జిల్లాలు, శాఖలు పోటీ పడాలని
దిశానిర్దేశం

'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే
తనకు సంతృప్తి అన్న సీఎం

నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని
అధికారులకు సూచన

'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'తో స్వర్ణాంధ్ర సాధన సాధ్యమన్న
చంద్రబాబు

2

## ఆనం యూటర్న్...
### వచ్చే ఎన్నికల్లోనూ పోటీ.. ?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 10)

నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో ▶2లో



## బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర..
## భారత్‌కు జిన్‌పింగ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 10)

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకు ముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం. భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో ▶2లో

## కేబినెట్ హోదాతో నాగబాబు... జీతం ఎంతో తెలుసా ?

(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 10)



జనసేనలో కీలక నాయకుడు, ఎమ్మెల్సీ అయిన నాగబాబుని ఈ మధ్యనే ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి వరించింది. ఈ పదవితో పాటు ఇపుడు కేబినెట్ హోదా కూడా కూటమి ప్రభుత్వం ఆయనకు కట్టబెట్టింది. దాంతో మంత్రులతో సమానంగా నాగబాబు కూడా అధికారిక కార్యక్రమాలలో పాల్గొనవచ్చు. అంతే కాదు ఆయనకు ప్రోటోకాల్ వర్తిస్తుంది. అలాగే జీతభత్యాలు కూడా పెద్ద ఎత్తున లభించనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన జీత భత్యాలు అదే విధంగా సిబ్బంది నియామకం ఇతర ప్రయోజనాలకు సంబంధించి ప్రభుత్వం 2025 జనవరి 10న జారీ చేసిన జీవో నంబర్ 7ను ప్రస్తావించింది. ▶2లో

## కాకినాడ జిల్లాలో పులి సంచారం..
### రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 10)



కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర ▶2లో

## స్థానిక ఎన్నికల్లో పోటీ....
# జగన్ వ్యూహం ఇదే !

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 10)



స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ వైసీపీ ఎందుకు చేస్తుంది అంటే రాజకీయ పార్టీ కాబట్టి అని జవాబు రావచ్చు. అయితే వైసీపీ రెండేళ్ళ క్రితం దారుణంగా ఓటమి పాలు అయింది కదా, పైగా కూటమి అధికారంలో ఉంది కదా ఇంతలో మార్పు ఏమి వస్తుంది. కూటమి ఐక్యంగా ఉంది. మూడు పార్టీలు కలసి పోటీ పడుతున్న వేళ స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఏమి ప్రయోజనం చేకూరుతుంది అన్న చర్చ ఉంది. అంతే కాదు ప్రజలు కూడా మరో మూడేళ్ళ పాటు అధికారం కూటమికే ఎటూ ఉంటుంది కాబట్టి కచ్చితంగా కూటమి అభ్యర్ధులకే జై కొడతారు అన్నది కూడా వాస్తవం. మరిన్ని విషయాలు తెలిసి వైసీపీ పోటీ పడడం ఎందుకు అంటే అక్కడే జగన్ మార్క్ వ్యూహం ఉంది అని అంటున్నారు.

**కసి పెరగాలి అంటూ :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగవని జగన్ పార్టీ నేతల సమావేశంలో చెప్పుకొచ్చారు. అంతమాత్రాన వైసీపీ ఎన్నికలను వదిలేసి దూరంగా వెళ్ళిపోదని అన్నారు. వైసీపీని నమ్ముకుని ప్రజలు ఉన్నారని వారి కోసం వారికి తోడుగా నిలబడేందుకు పోటీ చేయాల్సిందే అని జగన్ సూచిస్తున్నారు. అంతే కాదు పంచాయతీ వార్డు మెంబర్ విషయంలో కూడా కూటమి అసలు వదలదని పోలీసులను పెట్టి అధికార దుర్వినియోగం చేసి అయినా గెలిచేందుకు చూస్తుందని అన్నారు. అపుడు కచ్చితంగా ఆ వార్డు మెంబర్ గా పోటీకి దిగిన వైసీపీ కార్యకర్తకు కసి వస్తుందని అన్నారు, ఆ కసితోనే 2029 ఎన్నికల్లో కూటమిని ఓడించేందుకు పోరాటం చేసే స్ఫూర్తి వస్తుందని జగన్ విశ్లేషించారు. అందుకే పోటీ చేయమని తాను కోరుతున్నాను అని ఆయన చెప్పారు. ▶2లో

## మొదటి పేజీ తరువాయి

# ఎన్నారైలు మరింత శక్తిమంతం..

# ఈ సారి కూటమికి లక్.. !

చాలానే తేడా ఉంది. ఎన్నారై గ్లోబల్ టీడీపీ అధ్యక్షుడిగా పి. గురు రాజాతోపాటు సభ్యులను విస్తృత సంఖ్యలో పెంచారు. ఇప్పటి వరకు 34 మంది సభ్యులను నియమించారు. మరో 16 మందిని కూడా త్వరలోనే నియమించారు. వీరిలో వివిధ దేశాలకు చెందిన వారు ఉన్నారు. తద్వారా.. ఎన్నారై కమిటీలు బలోపేతం కావడంతోపాటు.. మరింత అంకిత భావంతో పనిచేయాలన్నది టీడీపీ ఉద్దేశం.వచ్చే ఎన్నికల్లోనూ ఎన్నారైల పాత్ర ఉండనున్నందన్న విషయాన్ని టీడీపీ చెప్పకనే చెప్పింది. అంటే.. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీలు.. మద్దతు ఇచ్చే ఇతర పార్టీలు.. సహా.. ఇప్పుడు ఎన్నారైలు కూడా తోడైతే.. ఊరూవాడా .. కూటమి విజయానికి మరింత మంది కలిసి పని చేసే అవకాశం ఉంటుంది. ఇంత భారీ స్థాయిలో వైసీపీకి కార్యకర్తల సంఖ్య లేకపోవడం.. ముఖ్యంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారు లేకపోవడం వంటివి కూటమికి ముఖ్యంగా టీడీపీకి కలిసి రానున్నాయి.

# అప్పుడే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది

# డొనాల్డ్ ట్రంప్

ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

**దెబ్బతిన్న అమెరికా విమానాలు**

జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ దాడులు చేయడంతో పలు సైనిక విమానాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఏ-10 థండర్‌బోల్ట్ విమానంతో పాటు ఎనిమిది ఎఫ్-15 యుద్ధ విమానాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు అమెరికా బలగాలు 30 పాట్రియాట్ క్షిపణులను మోహరించాయని తెలిపింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్ నుంచి పదుల సంఖ్యలో అమెరికా విమానాలు పనిచేస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో ఈ బేస్ కీలకంగా మారింది.

# బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్

అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఆనం యూటర్న్...

# వచ్చే ఎన్నికల్లోనూ పోటీ.. ?

(రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యూటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్నచర్చ.

ప్రస్తుతం 70ంకు చేరి ఆనం.. మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు; ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.

**టీడీపీ ఆలోచన ఏంటి..?**

టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరఫున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంను నామినేటెడ్‌పదవికి షిఫ్టు చేసి.. ఆత్మకూరును వేరే వారికి ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. కానీ, ఆనం మాత్రం.. ఈ విషయాలు వెలుగు చూస్తున్న క్రమంలో మరింత యాక్టివ్ అవుతుండడం గమనార్హం.

# కాకినాడ జిల్లాలో

# పులి సంచారం..

నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కేబినెట్ హోదాతో నాగబాబు...

దాంతో ఆ జీవో ప్రకారం నాగబాబుకు జీతంగా రెండు లక్షల రూపాయలు నెలకు దక్కనుంది. సిబ్బంది ఇతర అలవెన్సులు కింద మరో రెండున్నర లక్షల రూపాయలు కూడా లభిస్తాయి. ఈ లెక్కన ఆయనకు నెలకు నాలుగున్నర లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి దక్కనుంది.

**పచ్చదనం కోసం :**ఏపీలో పచ్చదనం కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి దానికి చైర్మన్ గా నాగబాబుని నియమించారు. దానికి ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ గా పేరు పెట్టారు. దీంతో నాగబాబుకు కూడా ఏపీలో అధికారిక కేబినెట్ హోదా లభించినట్లు అయింది. ఇదిలా ఉంటే ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పలువురుని వివిధ అంశాలకు సంబంధించి సలహాదారులుగా నియమించింది. వారికి కేబినెట్ హోదా ఇచ్చింది. అదే క్రమంలో నాగబాబుకు కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తూ కేబినెట్ హోదా ఇచ్చారు అని అంటున్నారు.

**మంచి హోదాతో :**ఇక నాగబాబు ఎమ్మెల్సీగా ఇప్పటికే ఉన్నారు. ఆయనకు దానితో పాటు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కూడా తోడు అయింది. ఇక ఆయన కేబినెట్ హోదాతో ఏపీవ్యాప్తంగా పర్యటించేందుకు వీలు అవుతుంది. అలాగే అధికారిక సమావేశాలు నిర్వహించడం ద్వారా తనకు అప్పగించిన బాధ్యతలను కమిటీ చైర్మన్ గా నెరవేర్చేందుకు వీలు ఉంటుంది. నాగబాబుని నిజానికి ఏపీలోని కూటమి ప్రభుత్వంలో మంత్రిగా తీసుకోవాల్సి ఉంది. ఆ మేరకు ఆయనకు హామీ కూడా ఉంది. అయితే అది కొన్ని సమీకరణల వల్ల కుదిరే అవకాశం లేకపోవడంతో ఈ విధంగా ఆయనకు తగిన హోదా గౌరవం ఇచ్చి సముచితమైన స్థానం కల్పించారు అని అంటున్నారు. దాంతో రానున్న రోజులలో ప్రభుత్వంలో కూడా నాగబాబుకు ప్రాధాన్యత మరింతగా పెరగనుంది అని అంటున్నారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీ....

# జగన్ వ్యూహం ఇదే !

**గెలుపు కంటే పోరాటం :**స్థానిక ఎన్నికల్లో అంతా సజావుగా సాఫీగా సాగితే వైసీపీ విజయం ఖాయమని జగన్ స్పష్టం చేశారు. అయితే అలా జరపనీయరని ఆయనే విమర్శించారు. అయితే ఎన్నికల్లో పోటీ చేయడం ఒక పోరాటం అని ఆయన అభివర్ణిస్తున్నారు. అలా పోరటం చేసిన వారే 2029 ఎన్నికల నాటికి వైసీపీ తరఫున నిలిచే గట్టి క్యాడర్ గా మారుతారు అని ఆయన చెప్పారు. ఇంతకు ఇంత కూటమి మీద కసి తీర్చుకోవడానికి ఎదురుచూసే ప్రతీ వైసీపీ కార్యకర్త ఒక శ్రీ క్రిష్ణుడు అవుతాడు అని జగన్ చెప్పారు. అందువల్ల 2029 ఎన్నికల్లో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో వీరే కూటమిని ఓడించి వైసీపీకి విజయం సాధించి పెడతారు అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**స్తబ్ధుగా క్యాడర్ :**

నిజానికి చూస్తే వైసీపీ క్యాడర్ అంతా స్తబ్ధుగా ఉంది అని అంటున్నారు. ఎక్కడికక్కడ నాయకులు కానీ క్యాడర్ కానీ కో ఆర్డినేషన్ లేకుండా ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారు. స్థానిక ఎన్నికలను కనుక వైసీపీ సీరియస్ గా తీసుకోకపోతే ఆ పార్టీకి ఓటేసే అభిమానులు కానీ 40 శాతం ఓటు షేర్ ని కాపాడుకోవడానికే రంగంలోకి దిగుతోంది అని అంటున్నారు. మరి వైసీపీకి 2024లో వచ్చిన 40 శాతం ఓటు షేర్ అలాగే కొనసాగుతుందా లేక పెరుగుతుందా లేక తగ్గుతుందా అన్నది కూడా ఈ లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు తెలియచేస్తాయి అని అంటున్నారు. చూడాలి మరి జగన్ చెప్పినట్లుగా క్యాడర్ లో కసి ఏ విధంగా ఉంటుందో.

# రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 10)

"గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్**

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం**

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

**టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం**

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అవకాశాలను అందిపుచ్చుకుని, నకిలీ ప్రచారాలను తిప్పికొట్టాలి**

ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు. వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు.గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, నీటి భద్రత ఒక సవాలుగా మారిందని, అయినా తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు.

2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్దామని ఆయన అధికారులలో స్ఫూర్తి నింపారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిమ్మన్నపాలెం స్వర్ణ గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, సెప్టంబర్ 10)

తిమ్మనపాలెంలో స్వర్ణ గ్రామ కార్యాలయాలను జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఎం వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త పెన్షన్లు దరఖాస్తుల పై ఆయన ఆరా తీశారు. అర్హులైన వారు ఈ నెల 16లోగా స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వెంకటేశ్వరరావు సూచించారు.మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్, కౌశలం, ఆధార్ సేవలు, పీజీఆర్ఎస్ అర్జీలు, ఏపీ సేవలు తదితర కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రటరీ అద్దంకి శ్రీను, నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఆఫీస్ టేబుల్ వితరణ



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 10)

మండలంలోని పెద్ద నల్లకాల్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.7,000 విలువ గల ఆఫీస్ టేబుల్ ను లయన్స్ క్లబ్ సభ్యుడు, గణేష్ ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ యజమాని జూలూరి శ్రీకాంత్ తన తండ్రి స్వర్గీయ గణేష్‌రావు జ్ఞాపకార్థం బహుకరించడం జరిగింది. పెద్ద నల్లకాల్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పత్తి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సమక్షంలో టేబుల్‌ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో కూడా ఈ పాఠశాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దాత శ్రీకాంత్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పేర్లి గుండయ్య, కార్యదర్శి మహబూబ్ బేగ్, లింగం రాజేంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వహణకు అన్ లైన్ అనుమతులు తప్పనిసరి

## సిఐ రామ్ నాయక్



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 10)

మండలంలోని వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఇంకోల్లు సిఐ రామ్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం గణేష్ మండపాల నిర్వహులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామ్ నాయక్, ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా గణేశ్ మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా సమాచారాన్ని నమోదు చేసుకోవాలని సిఐ కోరారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి, భద్రతను పర్యవేక్షించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మండపం నిర్మిస్తున్న ప్రదేశం, మండప కమిటీ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు, విగ్రహం ఎత్తు, ఉత్సవాలు జరిగే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, వెళ్లే మార్గం వివరాలను స్పష్టంగా అన్ లైన్ లో నమోదు చేయాలని కోరారు. పండగ ప్రశాంతంగా జరుపుకోవాలని,అందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ రామనాయక్, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది మరియు మండప నిర్వహణదారులు పాల్గొన్నారు.




# ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 10)

ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మార్గదర్శకత్వంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు నేతృత్వంలో గురువారం మార్కాపురం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మార్కాపురం మున్సిపాలిటీ, జిల్లా అటవీ శాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి మంద్రు రమేష్ బాబు పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
11.09.26 శుక్రవారం


# నేడు కలనూతల, చింతలముడిపి గ్రామ వాసులకు ఇళ్ల పట్టాలు, నిత్యవసరాల పంపిణీ



### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 10)**

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన కలనూతల, చింతలముడిపి గ్రామ వాసులకు ఈ నెల 11వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో ఇళ్ల పట్టాలు, నిత్యవసర సరుకులు, బియ్యం అందజేయబడతాయని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



# గణేష్ మండపాలకు కోరిన వారికి ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

### రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టెంబర్ 10)**

ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, కార్యదర్శి వలివర్తి దుర్గాప్రసాద్‌రాజు, ప్రభుత్వ సంబంధాల సమన్వయ కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి గణేష్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందించాలని వినతిపత్రం సమర్పించి కోరారు. కోరిన గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు. రాష్ట్రంలో గణేష్ ఉత్సవాలు చక్కగా జరగాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రభుత్వం ద్వారా "సింగిల్ విండో నమోదు పద్ధతి, ఉచిత విద్యుత్తు" తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వారు తెలియజేశారు. గణేష్ మండపాల వద్ద ఉత్సవాల కోసం గణేష్ కాషాయ ధ్వజాలు, పర్యావరణ ప్రాధాన్యతను తెలియజేసే బ్యానర్లను గణేష్ ఉత్సవ సమితి ప్రతి గణేష్ మండపానికి ఉచితంగా ఇవ్వడానికి తయారు చేసిన వాటిని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం గణేష్ మండపాలకు "ఉచిత విద్యుత్తు, సింగిల్ విండో నమోదు పద్ధతి" ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ధన్యవాదాలు తెలియజేసింది.

# వృద్ధిరేటులో ప్రకాశం జిల్లా ర్యాంకుల్లో ముందంజ



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 10)**

అమరావతి సచివాలయంలో గురువారం జరిగిన కలెక్టర్ల సదస్సుల్లో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పై చర్చ జరిగింది. ఇందులో ప్రకాశం జిల్లా స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో మిగిలిన జిల్లాలను వెనక్కి నెట్టి ముందంజలో నిలిచింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో గత ఏడాది, ఈ ఏడాది త్రైమాసిక ఫలితాలు చూసుకుంటే ప్రకాశం జిల్లా 7వ ర్యాంకు నుంచి 5వ ర్యాంకుకు ఎగబాకింది. 2025-2026 ఆర్థిక సంవత్సరం 2,388 కోట్లతో 7వ స్థానంలో ఉన్న ప్రకాశం జిల్లా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో రూ.3,202 కోట్లు అనగా 34.09 శాతం వృద్ధితో 5వ స్థానానికి ఎగబాకిందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ తన ప్రెజెంటేషన్లో తెలిపారు. దీనిపైన ముఖ్యమంత్రి స్పందిస్తూ ఇది శుభ పరిణామమన్నారు. ప్రకాశం జిల్లాలో నమోదైన 34.09 శాతం వృద్ధి రాష్ట్ర అగ్రికల్చర్ , అలైడ్ సెక్టార్ వృద్ధి రేటు 14.19 శాతం కంటే గణనీయంగా అధికం. వృద్ధి రేటులో వెనుకబడిన జిల్లాలు ఈ స్ఫూర్తిని అందుకోవాలన్నారు.



# ఎన్టీఆర్ స్ఫూర్తితో రైతులకు సంక్షేమాలు

### ఆస్తుల హరించేందుకు జగన్ కుట్రలు
### కూటమి ప్రభుత్వ సంస్కరణలతో రైతేరాజు
### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 10)**

టీడీపీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సంక్షేమాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం మండల పరిధిలో పర్యటించిన ఆయన ముందుగా మైనింగ్ గ్రాంట్ నిధులు ద్వారా రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చి కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు అనంతరం గ్రామంలో పర్యటించి, స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ▶4లో

# వెలిగొండ ప్రాజెక్టు జలాల పై ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సమీక్ష



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 10)**

వెలిగొండ ప్రాజెక్టు నీటిని కనిగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కనిగిరిలో అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన వెలిగొండ ప్రాజెక్ట్ నీటి లభ్యత, వినియోగంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు తాగు, సాగునీరు అందేలా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడంతో పాటు, ప్రతి ఇంటికీ ▶4లో

# పురిటి బిడ్డను వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తులు



### ఒంగోలులో చోటు చేసుకున్న దారుణం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 10)**

ఒక రోజు క్రితం పుట్టిన పురిటి మగ బిడ్డను వదిలేసిన ఘటన ఒంగోలు సమత నగర్ చెరువు కట్ట వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఒంగోలు సమతానగర్ చెరువు కట్ట వద్ద వాకింగ్‌కి వెళ్ళిన కొందరికి బిడ్డ ఏడుపు వినిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు, అలాగే బాలల సంరక్షణ అధికారులకు సమాచారం చేరవేశారు. తీవ్ర చలి, వాతావరణ పరిస్థితుల వల్ల పసికందులో గ్లూకోజ్ స్థాయి పడిపోవడంతో పాటు, ఇన్ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉండటంతో బాబును వెంటనే రిమ్స్‌లోని ఎస్ఎన్‌సియు వార్డులోకి తరలించినట్లు బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం నవజాతి శిశువుకు చికిత్స అందిస్తున్నారని, పోలీసులు బిడ్డ తల్లిదండ్రుల కోసం దర్యాప్తు చర్యలు చేపట్టారని దినేష్ కుమార్ వివరించారు.




## వెలిగొండ ప్రాజెక్టు జలాల పై ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సమీక్ష



మంచినీరు సరఫరా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్) రూపొందించాలని సూచించారు. పనులను వేగవంతం చేసి, నీటి సరఫరా లో ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో రైతులకు సంక్షేమాలు



గ్రామంలో మండల రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని, 857 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతుల ఆస్తులను హరించేందుకు జగన్ రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. పట్టదారు పాసుపుస్తకాలపై, పొలం గట్ల రాళ్లపై జగన్ ఫోటో ముద్రించుకుని రాష్ట్రంలోని రైతుల ఆస్తులను తాకట్టుపెట్టాలని చూశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ రీసర్వే ద్వారా రైతుల ఆస్తులను పరిరక్షించేలా పాసుపుస్తకాలపై రాజముద్రను ముద్రించి పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. అలానే జగన్ రెడ్డి ఎత్తివేసిన 33 రైతు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్దరించి, రైతును రాజును చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యకక్రమంలో తహశీల్దార్ వరకుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జునరావు, లింగా బ్రహ్మయ్య, జానికిరామయ్య, శంకర్, రమేష్, నాగేశ్వరరావు, పులి హరి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీఎస్టీ పెన్షన్లకు చాప చుట్టిన చంద్రబాబు
## ఎస్సీ, ఎస్టీ పెన్షన్ల ఎన్నికల హామీ పై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి స్పందించాలి

### దళిత నేత నీలం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 10)

వృద్ధాప్య, వితంతు, వంటరి మరికొన్ని ఇతర కులాలకు కొత్త పెన్షన్లు మంజూరు చేసి ఎన్నికల హామీ లో ఇచ్చిన 50 ఏళ్ళకే ఎస్సీ ఎస్టీ లకు ఇస్తామన్న వృద్ధాప్య పెన్షన్ పథకానికి చంద్రబాబు ప్రభుత్వం చాప చుట్టిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్ ఆరోపించారు. గురువారం కనిగిరి సబ్ డివిజన్‌లో పలు పెండింగ్ కేసుల విషయమై కనిగిరి సీఐ యు శ్రీనివాస్ రామాన్, కనిగిరి ఎస్ఐ సందీప్‌ను కలిసి మాట్లాడారు. తదనంతరం కనిగిరి పోలీస్ స్టేషన్ ముందు నీలం నాగేంద్రరావు మీడియాతో మాట్లాడుతూ 2004 ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం 50 యేండ్లు నిండిన ఎస్సీ ఎస్టీలకు వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని ప్రకటించిందన్నారు. ఎన్నికల హామీలో లేని పి4 లాంటి పథకాలను కూడా పేదరికం నిర్మూలిస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిందన్నారు. అలాగే సూపర్ 6 పథకాన్ని కూడా సూపర్ పబ్లిసిటీ ఇస్తు కూటమి ప్రభుత్వం మాటలు కోటలు దాటుతుందన్నారు. గత ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిన 28 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని ఎస్సీ, ఎస్టీ ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయటం లేదన్నారు. భూములు ఉన్న భూస్వాములకు రైతు భరోసా ఇటీవల చీరాలలో చేనేత కార్మికులకు చేనేత భరోసా పేరుతో కోట్లాది




రూపాయలు విడుదల చేసిందన్నారు. అలాగే కూటమి ఓటు బ్యాంక్ కులాలైన గౌడ, మత్స్యకార, చేనేత కులాలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. కానీ సొంత ఇండ్ల స్థలాలు, సాగుభూమి కాక స్మశాన భూములు కూడా లేని ఎస్సీ, ఎస్టీలకు మాత్రం ఎన్నికల హామీలు పేర్కొన్నట్టు కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకు వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయలేదన్నారు. శనివారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ సమీక్ష సమావేశంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ పెన్షన్ల పై ప్రకటన చేయలేదన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామితో సహా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఎవరు 50 ఏళ్ళకే ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్ల పంపిణీ అమలు పై రెండు సంవత్సరాల తర్వాత కూడా నోరు విప్పలేదన్నారు. పెన్షన్ల మంజూరు సంబంధిత శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే మంజూరుకు చర్యలు తీసుకోవాలని నీలం నాగేందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను మాదిగ పరిరక్షణ సమితి కార్యదర్శి పత్రా బంగారం, జి బర్నబాసు, కోటయ్య, తదితరులు ఉన్నారు.

## పోలింగ్ స్టేషన్‌ల జాబితా పై ప్రత్యేక సమావేశం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 10)

కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని 32 వార్డుల యొక్క 42 పోలింగ్ స్టేషన్ల జాబితాపై సూచనలు, సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ ప్రకారం, ఈ నెల 7న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు హాజరై తమ విలువైన అభిప్రాయాలు, సూచనలు అందించాలని కమీషనర్ కోరారు.

## వైయస్ఆర్‌సీపీ నెల్లూరు జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొన్న బుర్రా
# రీజనల్ కోఆర్డినేటర్ చేతుల మీదగా ఐడి కార్డ్ అందుకున్న బుర్రా

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 10)



పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ, పార్టీ క్యాడర్‌కు ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కందుకూరు నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూధన్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గంలో మున్సిపాలిటీ, జెడ్పిటిసి, ఎంపీటీసీ, పంచాయితీలలో పోటీ చేయడం జరుగుతుందన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ కార్యకర్తలకు అత్యధికప్రాధాన్యత కల్పిస్తూ స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్లమెంటు సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు ఐడి కార్డును అందచేయడం జరిగినది.






## కుంకులమర్రులో విలేజ్ హెల్త్ క్లినిక్‌కు భూమిపూజ
### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో వైద్య సేవలకు మరో ముందడుగు



(షణ్ముఖ వెలుగు, కారంచేడు, సెప్టంబర్ 10)

కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పర్చూరు నియోజకవర్గంలోని కుంకులమర్రు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. భూమిపూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఇకపై చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు గ్రామస్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ప్రాథమిక వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని నాయకులు తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తయితే కుంకులమర్రు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని వారు తెలిపారు. ఇ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు పోలీస్ పోర్టల్‌లో నమోదు తప్పనిసరి
### డీఎస్పీ నాగరాజు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 10)




మార్కాపురంలో వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ పోర్టల్‌లో మండపాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు పోలీస్ శాఖ నిబంధనలను పాటించాలని సూచించారు. వేడుకల సమయంలో ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విపరీతమైన శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా పండుగను మార్చకూడదని డీఎస్పీ నాగరాజు స్పష్టం చేశారు. ఇతరుల ప్రశాంతతకు భంగం కలగకుండా, నిబంధనలకు లోబడి వేడుకలను నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖకు నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని డీఎస్పీ నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, పట్టణ, గ్రామీణ ఎస్ఐలు విశ్వనాథరెడ్డి, వి వేమన పాల్గొన్నారు.

## వైసీపీ సోషల్ మిడియా కార్యకర్త రామ్ బురగకు పరామర్శ



(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, సెప్టంబర్ 10)

పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సైనికుడు రామ్ బూరగ గతంలో జరిగిన ప్రమాదం కారణంగా ఎడమ కాలులో రాడ్ వేయించుకని ఆ రాడ్‌ను తొలగించేందుకు నరసరావుపేట శ్రీ హాస్పిటల్‌లో చికిత్స కుంటున్న సందర్భంగా యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణు బాబు అదేశాలతో నాయకులు యద్దనపూడి గ్రామ అధ్యక్షులు నల్లపనేని లక్ష్మయ్య, షేక్ బుడే, నల్లపనేని వేణు బాబు, బొందు జయప్రకాష్, కవల అఖిల్‌లు ఆసుపత్రికి చేరుకుని రామ్ బూరగ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

## నేడు నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం
### ఈఈ డి లక్ష్మీపతి

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 10)

మైదుకూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతు పనులు చేపడుతున్నందున, ఈ నెల 11వ తేదీ శుక్రవారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ డి లక్ష్మీపతి తెలిపారు. శుక్రవారం ఉదయం 6:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు (12 గంటల పాటు) నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, పరిశ్రమలు మరియు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వీలైనంత వరకు ప్రత్యామ్నాయ (మరొక) మార్గం ద్వారా గృహ, వాణిజ్య అవసరాలకు విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా అవాంఛనీయ, సాంకేతిక ప్రతికూల పరిస్థితులు ఎదురైతే సరఫరాలో అంతరాయం కలగవచ్చు అని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు 3 ఫేజ్ సరఫరా గురువారం అర్ధరాత్రి 12 గంటల నుండి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు, తిరిగి శుక్రవారం సాయంత్రం 6 గంటల తర్వాత పునరుద్ధరించబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, శాఖాపరమైన పనులకు సహకరించవలసిందిగా కోరారు.

## మహిళా భద్రత, సైబర్ నేరాల పై పోలీసుల అవగాహన సదస్సు



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 10)

మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు ఎస్ఐ వెంకటరమణ పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణ సహాయం కోసం 'డయల్ 112' సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు చైతన్యవంతంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఐడి, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి అని వివరించారు. మహిళల రక్షణ, సైబర్ నేరాల అదుపులో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్.ఐ. విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 10)

ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక వివాదాలు, విద్యుత్ మరియు ఇతర రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేసుల పరిష్కారంలో భాగంగా కక్షిదారులు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే అవార్డు తుది నిర్ణయంగా ఉంటుందని, దానికి అప్పీల్ ఉండదని పేర్కొన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలి

### సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
### డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 10)

ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బందితో డాక్టర్ యుగంధర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బందికి సంబంధించిన అన్ని వివరాలను సేవా నమోదు పుస్తకంలో (ఎస్ఆర్) తప్పనిసరిగా ధ్రువీకరించి నమోదు చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని సేవా నమోదు పుస్తకంలో సక్రమంగా పొందుపరచాలని తెలిపారు. వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేసి పరిపాలనా సంబంధిత సమస్యలకు తావులేకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ సేవా నమోదు పుస్తకాలను భౌతికంగా నిర్వహించడంతో పాటు నిధి పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ సేవా నమోదు పుస్తకాలను ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎస్ఆర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సమాచారాన్ని ఈ-ఆఫీస్ ద్వారానే పంపించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ హెచ్‌పీవీ టీకాతో పాటు ఇతర వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో వేయించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఆవిష్కరించారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎల్ఏటీఓ డాక్టర్ రవిబాబు, డీఐఓ డాక్టర్ ప్రవీణ్, పీఓ ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ ఆరిఫుల్లా, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.




## మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముస్లిం నాయకులు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 10)

మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్ కె అఫ్రోజ్, బూత్ కన్వీనర్ ఎస్‌కే ఖాసీం వలి, కో కన్వీనర్ షేక్ బాషాలు కలిసి కరచాలనంతో పరిచయం చేసుకొని కొంత సేపు ముచ్చటించుకున్నారు. వీరి కలయక పట్ల మండల యూత్ అభినందనలు తెలియజేశారు.







## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వి రమేష్‌కు ఘన సత్కారం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 10)



పట్టణంలోని పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ భవనం నందు కొనకనమిట్ల మండలంలోని చింతగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వి రమేష్‌రెడ్డిని ఉమ్మడి



ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. సెప్టెంబర్ 5వ తేదీ గురుపూజోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వి రమేష్‌ను పలువురు జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి అవార్డు పొందాలని ఇంకా మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వి రమేష్ మాట్లాడుతూ నేను గత 16 సంవత్సరముల నుండి తాను పని చేసిన ప్రతి పాఠశాలను అభివృద్ధి పదంలో నడిపించడంలోనూ విద్యార్థుల ప్రగతి నమోదులోనూ, వివిధ రకాల శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వివిధ రకాల ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు శిక్షణ అందించడంలోనూ చూపిన ప్రగతి కారణంగా నాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుర్డు లభించిందని నా అవార్డును మా తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నానని, వయసులో నాకన్నా పెద్దలు ఎంతో ప్రేమ అభిమానాలతో నన్ను ఇంత గొప్పగా సన్మానించడం నాకు చాలా సంతోషంగా ఉందని ఇది తన పూర్వజన్మ సుకృతంగా, అదృష్టంగా భావిస్తూ అందరికీ అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి గుమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి దేవప్రసాదు, గోనె శ్రీనివాసులు, పి ఆంజనేయ చౌదరి, సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసులు, జె వెంకటేశ్వర్లు, బి కృపారావు, పిల్లి బాల నరసయ్య, పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ బాదుల్లా, షేక్ మదర్ వలి, మూసా జాని, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, మానవతా సేవా సంస్థ ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు కే ఎలమందరెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు సోమరాజు, హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ షేక్ కరీముల్లా బేగ్, తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## సీఎం ఎస్ఎస్‌జి ఎస్పీ భద్రయ్యను కలిసిన పోలేపల్లి జనార్ధనరావు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 10)



మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామానికి చెందిన శ్రీశైలం వాసవి సముదాయ సత్రం జాయింట్ సెక్రెటరీ పోలేపల్లి జనార్దనరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం ఎస్ఎస్‌జి ఎస్పీ భద్రయ్య జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీకృష్ణ యాదవ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, బుక్స్ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 10)

శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణ యాదవ్ ఫ్రెండ్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం బాలాజీ నగర్, ఇతర గవర్నమెంట్ మున్సిపల్ స్కూల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు ప్యాట్స్, బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సంవత్సరం ఇలాగే పదో తరగతి చదివే విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని శ్రీకృష్ణ యాదవ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుట్టు బోయిన కోటి యాదవ్, కొఠారి నాగేశ్వరరావు, గోల వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, కుట్టుబోయిన కొండలరావు, తుమ్మకూరి దొర, కుట్టుబోయిన ఉగాది, తుమ్ముకూరి సాయి, నాగం శేషగిరి, మిరియం శీను (బుస ), ప్రిన్సిపల్ చల్ల ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.








## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే

# పీడిత ప్రజల తక్షణ కర్తవ్యం కావాలి

### ఎన్ వేణుగోపాల్ వీక్షణం ఎడిటర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 10) దేశంలో పీడిత ప్రజల హక్కుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన స్వేచ్ఛ, సమానత్వం, ప్రశ్నించే హక్కులను కాలరాస్తూ ఉద్యమించే గొంతులను అణగదొక్కుతున్నారని వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ అన్నారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు అమరుడు మన్నం ప్రసాద్ సంస్మరణ సందర్భంగా ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో మొదటి అంశంగా జెన్జీ ఉద్యమం పరిణామాలు అనే అంశం మీద ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రతి వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు పెట్టుబడిదారులకు కట్టబెడుతూ రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఉచిత విద్య, వైద్యం, ఆహారం ఉపాధిని ఈ దేశ ప్రజలకు అందించకుండా అర్ధాకలితో అలమటించే విధంగా చేస్తూ ఆకలి చావులకు గురి చేస్తున్నారన్నారు. నీట్ వంటి పరీక్ష పేపర్లను లీక్ చేస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థులపై కిరాయి గుండాలతో విశక్షణారహితంగా లాఠీచార్జ్ చేసి ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రలు చేశారన్నారు. అది చివరకు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిందన్నారు. ఆయన మాట్లాడుతూ నిరాశ ని స్పృహలకు గురవుతున్న ప్రజలకు ఒక దిక్సూచి అందించింది అన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు ఇలాంటి విద్యార్థి ఉద్యమాలను బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. అదే మనం మన్నం ప్రసాదు లాంటి అమరులకు అందించే నివాళి అన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు భారత రాజ్యాంగం పాలకవర్గాల వైఖరి అనే అంశం మీద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే కృష్ణ అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గోళ్ళ రమేష్






మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం ప్రజలు పోరాడి సాధించుకున్న భారత రాజ్యాంగాన్ని అది ఆశించి రూపొందించుకున్న స్వేచ్ఛ సమానత్వం ప్రజా స్వామ్యాన్ని మార్చి పెట్టుబడిదారులకు అగ్రకుల భూస్వామ్య శక్తులకు అనుకూలంగా మార్చుకుంటూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలుకన్న రాజ్యాంగం స్థాపించుకోకుండా సనాతన వాదాన్ని నియంతృత్వం వైపు దేశాన్ని తీసుకొని వెళు తున్నారు అన్నారు. దేశంలోని ప్రజలందరూ ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజాస్వామ్యాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, రాష్ట్ర కోశాధికారి కావలి బాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ శ్రీరాములు, తూమాటి శ్రీరాములు, ఓర్సు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రజాకళా మండలి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## మైదుకూరు నియోజకవర్గంలో

# ముమ్మరంగా 'టీడీపీ ఇంటింటికీ' ప్రచారం

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపుతో కదిలిన నాయకులు

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 10)

మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలు మండలాల్లో 'టీడీపీ ఇంటింటికీ' ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. దువ్వూరు మండలం మీర్జాఖాన్‌పల్లె గ్రామంలో లక్ష్మయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను, ఊరిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. ఖాజీపేట పట్టణంలో ఘనంగా టీడీపీ కార్యక్రమం ఖాజీపేట పట్టణంలో హర్షద్, కదీర్‌ల ఆధ్వర్యంలో 'టీడీపీ ఇంటింటికీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రతి కుటుంబాన్ని కలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పూసగుచ్చినట్లు వివరించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్ నాయుడు, పార్టీ నాయకులు సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. ప్రతి గడపను సందర్శిస్తూ, పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వ అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంక్షేమ ఫలాలను తలుపుతట్టడమే తమ నైతిక బాధ్యత అని ఈ సందర్భంగా పాల్గొన్న టీడీపీ నాయకులు, శ్రేణులు స్పష్టం చేశారు.







## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవిసమ్రాట్

# విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 10)

స్థానిక జివిఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉలవపాడు నందు తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు వై సుధాకర బాబు మాట్లాడుతూ విశ్వనాథ వారు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన యుగపురుషుడని, ఆయన రచించిన 'రామాయణ కల్పవృక్షం' తెలుగు జాతికే గర్వకారణమని కొనియాడారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయి పడగలు', వారి ఇతర రచనల గురించి, వారు పొందిన సత్కారాల గురించి సవివరంగా తెలియజేశారు. మాతృభాషా పరిరక్షణకు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాల విలువల వ్యాప్తికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు విశ్వనాథ రచనలను అధ్యయనం చేసి భాషా పరిజ్ఞానాన్ని, నైతిక విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## గణేష్ ఉత్సవాల పై యువతకు అవగాహన



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 10)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కంభం పట్టణానికి చెందిన యువతను కంభం పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై శివకృష్ణారెడ్డి, గణేష్ విగ్రహాల ప్రతిష్ఠ, భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సూచనలు, పోలీసుల మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఎస్సై సూచించారు. గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు యువత సహకరించాలని కోరారు.

## ఆరోగ్య పరీక్షలను పరిశీలించిన ఎంఈవో అబ్దుల్ సత్తార్



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 10)

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన విద్యార్థుల ఆరోగ్య పరీక్షలను ఎంఈవో అబ్దుల్ సత్తార్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఆరోగ్య పరీక్షల తీరును పరిశీలించిన ఆయన, విద్యార్థుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తదితర ఆరోగ్య వివరాలను వైద్య సిబ్బంది పరీక్షించి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

## అర్హులు పెన్షన్‌ల కొరకు దరఖాస్తు చేసుకోండి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టంబర్ 10)

కూటమి ప్రభుత్వం ఈ నెల 7వ తేదీ నుండి కొత్తగా వృద్ధాప్యం, వితంతువు, ఒంటరి మహిళ, వికలాంగుల,చేనేత కార్మికులు,గీత కార్మికులు,మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు పెన్షన్స్ అప్లై చేసుకోనే అవకాశం కల్పించిందని, ప్రజలందరూ వారి పెన్షన్‌లకు సంబంధించిన సర్టిఫికెట్స్ తీసుకొని వెళ్లి వారి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరోవ ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలందరికీ అన్ని పథకాలు అందేటట్టు వారి సంక్షేమానికి ఎలాంటి లోటు లేకుండా ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం నిర్వర్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నాయకులు అందరు కూడా కలిసికట్టుగా కార్యక్రమాన్ని ప్రజలకు చేరువుగా ఉండి పని చేయాలని కోరినట్లు తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా మాజీ సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి మర్రిబోయిన వెంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆత్మహత్యలు నిరోధించే విషయంలో వైద్య విద్యార్థులు అవరోధాలను అధిగమించాలి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 10)**

ఆత్మహత్యలు నిరోధించే విషయంలో వైద్య విద్యార్థులు అన్ని రకాల అవరోధాలను అధిగమించాలని, ఈ మేరకు జీవితంలో చదువుతూ అనేక విషయాల మీద అవగాహనతో ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సురేష్ కుమార్ ఉద్బోధించారు. జిజిహెచ్ సైకియాట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సూసైడ్ అనే అంశం పై ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హెచ్ఓడి డాక్టర్ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ అనేక ఫిసికల్, మెంటల్ ప్రభావాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ఒంటరి తనం లేని జీవితాన్ని అలవర్చుకొని షేరింగ్ కేరింగ్ స్వభావాన్ని పెంచుకోవాలన్నారు. ఫెయిల్యూర్ జీవితంలో భాగమే కానీ అంతం కాదన్నారు. జిఎంసి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బ్యాలెన్స్ లైఫ్ ముఖ్యమన్నారు. అందుకు కళాశాలలో కౌన్సిలింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్య వస్తే నేరుగా చెప్పుకునే వాతావరణం ఉండాలన్నారు. జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులు గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ ని సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ శ్రీ విద్య, డాక్టర్ ఆదిత్య, నర్సింగ్ ఎంబిబిఎస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి గణపతే-మహాగణపతి గోడపత్రిక విడుదల చేసిన జిల్లా పంచాయతీ అధికారి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 10)**

పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ కోసం రానున్న వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి గణపతిని పూజించి ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి అనుపమ సతీష్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం వాలంటీర్ ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన మట్టి గణపతి మహాగణపతి అన్న గోడపత్రికను ఆమె విడుదల చేశారు. సాంప్రదాయ బద్ధమైన ఈ పండుగను ప్రకృతి, పర్యావరణహితంగా జరుపుకోవాలని, ధ్వని, వాయు కాలుష్యంతో డీజేలు అలాగే బాణ సంచాల వినియోగాన్ని నివారించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ వీరభద్రాచారి మాట్లాడుతూ నేటి యువత అతి ఉత్సాహంతో ఎత్తయిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించేందుకు ముందుకు వస్తున్నారని, నిషేధిత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వలన భూగర్భ జలాలను అలాగే నదులు, సముద్రాలను కాలుష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి తగు చర్యల ద్వారా పిఓపి విగ్రహాల వినియోగాన్ని కట్టడి చేయాలని కోరారు. వినాయక చవితి రోజున ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ఆర్గనైజేషన్ ద్వారా జరుగుతుందని వీరభద్రచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు దార్ల శ్రీనివాసరావు, పైనం మధు, తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పై కూటమి ప్రభుత్వ, పోలీసు హింస పై న్యాయపోరాటం చేయాలి

### ఎస్సీ, ఎస్టీ లాకప్‌డెత్ లపై హైకోర్టులో కేసులేస్తాం
### చుండూరు ఎన్‌కౌంటర్ మృతుడు అనిల్ కుమార్ స్మారక సభలో దళిత నేత నీలం

**(షణ్ముఖ వెలుగు, గుంటూరు, సెప్టంబర్ 10)**



దళితుల పై కూటమి ప్రభుత్వ పోలీసు హింసపై న్యాయపోరాటం చేస్తామని ఎస్సీ ఎస్టీ లాకప్ డెత్ లపై హైకోర్టులో కేసులు వేస్తామని దళిత నేత నీలం నాగేంద్రరావు హెచ్చరించారు. గురువారం గుంటూరు ఫెన్షనర్ల భవనంలో చుండూరులో 35 సంవత్సరాల క్రితం పోలీసులు కాల్చి చంపిన కొమ్మర్ల అనిల్ కుమార్ స్మారక సభ జరిగింది. ఈ కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ కారంచేడు మాదిగలపై మారణకాండ కమ్మ భూస్వాములు జరిపారన్నారు కానీ చుండూరు మాలలపై మారణకాండ పోలీస్ అధికారులు దగ్గరుండి రెడ్డి నరహంతకులచే చేయించారన్నారు. చుండూరు మారణకాండ న్యాయపోరాటాన్ని అణిచివేయటానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం చుండూరు దీక్ష శిబిరంలో ఉన్న పల్లె వీరుడు కొమ్మర్ల అనిల్ కుమార్ ను కాల్చి చంపారన్నారు. నక్సలైట్లకే పరిమితమైన ఎన్కౌంటర్లను మొట్టమొదటిగా చుండూరు దళిత ఉద్యమకారుడు కొమ్మర్ల అనిల్ కుమార్ ను ఎన్కౌంటర్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన ఓటు బ్యాంకు మాలలకు తన వికృత రూపం చూపిందన్నారు. అప్పటినుండి దళితులపై రాష్ట్రంలో అగ్రకులాల మారణకాండలతో పాటు పోలీస్ లాకప్ డెత్ లు ఎన్కౌంటర్లు పెరిగిపోయాయి అన్నారు. గతంలో రాష్ట్రంలో ఎన్నో లాక్ అప్ డెత్ లు జరిగిన కేవలం పరామర్శలకు ఆందోళనలకు మాత్రమే పరిమితమయ్యాయి అన్నారు. కానీ 1996 లో ఒంగోలులో జరిగిన గద్దం ఏడుకొండలు లాకప్ డెత్ లో తాము పోరాటం చేసి రిటైర్డ్ హైకోర్టు జడ్జి పద్మనాభ గౌడ్ కమిషన్ వేయించి బాధిత కుటుంబానికి ఎక్స్గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం పోలీసులను ఉద్యోగం నుండి తీసివేయించామన్నారు. తరువాత రాష్ట్రంలో జరిగిన అనేకమంది దళితుల లాకప్ డెత్ లలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తూ పోలీసులపై కోర్టుల్లో కేసులు నడిపిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో దళితుడైన ఏడుకొండలు లాకప్ డెత్ జరిగిందన్నారు అలాగే కర్నూలు జిల్లాలో తమ కుమారుడిని పోలీసులు చంపారని హైకోర్టులో కేసు వేస్తే ఆ కేసు విచారణలో సి బి సి ఐ డి పోలీసులు మాల గంగవ్వను లాకప్ డెత్ చేశారన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో రేణంగివరం పోలీస్ స్టేషన్లో బల్లి దివ్య తేజ అను ఎస్టి యువకుడిని సెల్ ఫోన్ దొంగతనం కేసులో లాకప్ డెత్ చేసి శవాన్ని మాయం చేశారన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పొన్నకల్లు గ్రామానికి చెందిన చీకటి గోపి అను దళిత యువకుడిని చిత్తజల్ల గోపి అనే యువకుడు రుద్దుడి ఉంగరం దొంగలించిన కేసులో అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి చావగొట్టారన్నారు. కూటమి ప్రభుత్వం విజయవాడలో రౌడీ షీటర్ సాయి కృష్ణ లాకప్ డెత్ కేసులో సాయి కృష్ణ తల్లిని తన ఇంటికి పిలిపించికొని పరామర్శించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 20 లక్షలు ఎక్స్గ్రేషియా ఇచ్చాడన్నారు. అలాగే ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం దారకాని పాడు గ్రామంలో కాపు కులస్తుడిని తన కమ్మని కులానికి చెందిన వారు కారుతో గుద్ది చంపితే కోట్ల రూపాయలు నాలుగు ఎకరాల భూమి కాపులకు పరిహారంగా ఇచ్చి కాపు సేవలో చంద్రబాబు నాయుడు తరిశీ చాడన్నారు. కానీ పేట్రేగి పోయిన పోలీసు హింసతో ప్రాణాలు పోతున్న లాకప్ డెత్ లు చేసి పొలాలలో గవర్నమెంట్ హాస్పిటల్ లో పడవేస్తున్న కేసు నమోదు చేయకపోగా కనీసం జిల్లా కలెక్టర్ కూడా విచారణ చేయడం లేదన్నారు. క్రూర మృగాలైన పులులు చనిపోతే సనాతన స్టార్ జనసేన ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక విచారణ జరిపించి పులులు చంపిన వారిని అరెస్టు చేయిస్తున్నారని పులులు చనిపోవడానికి కారకులైన ఫారెస్టు సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నారన్నారు. కూటమీ ప్రభుత్వంలో క్రూరముగాలైన పులులకు ఉన్న విలువ ఎస్సీ ఎస్టీల ప్రాణాలకు లేదన్నారు కావున కూటమి ప్రభుత్వంలో దళితులపై పేట్రేగిపోతున్న పోలీస్ హింస లాకప్ డెత్ ల పై న్యాయపోరాటం చేయాలని అందుకని హైకోర్టులో కేసులు వేయటానికి తాము లీగల్ ఫోరం ఏర్పాటు చేస్తున్నామని నీలం నాగేంద్రరావు తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన అనిల్ కుమార్ స్మారక సభలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ శాంత కుమార్, అంగడాల పూర్ణచంద్రరావు, గంగాభవాని, మేడం భాగ్య రావు, సునీల్ కుమార్, భగత్ సింగ్, అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చయ్య చౌదరి జ్ఞాపకార్థం మెమోరియల్ ఆర్చికి శంకుస్థాపన

### ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్









**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టంబర్ 10)**

మండలంలోని పెదకొత్తపల్లి గ్రామంలో స్వర్గీయ పోతినేని బుచ్చయ్య చౌదరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం హైవే సమీపంలోని పెదకొత్తపల్లి గ్రామ ప్రవేశ మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న మెమోరియల్ ఆర్చికి సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం పోతినేని బుచ్చయ్య చౌదరి నివాసంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. బుచ్చయ్య చౌదరి గ్రామ అభివృద్ధి కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. = కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), మందపల్లి శ్రీనివాసరావు, మండవ మురళీకృష్ణ, రవి, నల్లూరి శ్రీను, జయంతి బాబు, ఉప్పుటూరి ప్రకాశం, బుచ్చయ్య చౌదరి సతీమణి సుబ్బలక్ష్మి, కుమారుడు పి శ్రీనివాసరావు, కోడలు కవిత, అల్లుడు శరత్ బాబు, కుమార్తె స్వర్ణలత, పోతినేని శిరీష, మనవరాళ్లు, మనవళ్లు, కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ది ఫాబ్రికేటెడ్ లీడర్ అనే పేరుతో ఒక కల్పిత, విషపూరిత పుస్తకం వ్రాయడాన్ని ఖండించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 10)**



భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, మా జాతి విమోచకుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ని అవమానపరుస్తూ హమారా ప్రసాద్ అనే వ్యక్తి "కల్పిత నాయకుడు, ది ఫాబ్రికేటెడ్ లీడర్" అనే పేరుతో ఒక కల్పిత, విషపూరిత పుస్తకం వ్రాయడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈ విజయభాను గురువారం ఖండించారు. బుధవారం రాత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదు – కోట్లాది దళితుల ఆత్మగౌరవం. ఆయన వల్లే ఈ రోజు అణగారిన వర్గాల ప్రజలు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నాం. అటువంటి మహనీయుడిని "కల్పిత నాయకుడు" అని పిలవడం అంటే ఈ దేశాన్ని, భారత రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమే అవుతుందన్నారు. ఈ పుస్తకం వల్ల కులాల మధ్య విభేదాలు ఏర్పడి దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. యువతలో తప్పుడు అభిప్రాయాలు వెళ్తాయన్నారు. కనుక కల్పిత నాయకుడు పుస్తక ఆవిష్కరణ సభను నిషేధించి-సదరు అంబేద్కర్ పై విషం చిమ్మే పుస్తకాన్ని బ్యాన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయమై తెలంగాణ ఎస్సీ కమిషన్, నేషనల్ ఎస్సీ కమిషనర్ లకు అమర ప్రసాద్ అనే వ్యక్తి పై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి సునీల్ కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జూపల్లి రాజు, కోశాధికారి ధన్యాసి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చదలవాడ కిషోర్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కరవాది జయప్రకాష్, మున్సిపల్ ఉద్యోగులు వై శ్రీను, బి జాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల శ్రీహరికోట సందర్శన




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 10)**

శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 10 మంది సిబ్బంది, 93 మంది విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో గల సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి చెందిన సాంకేతిక అధికారి రోశయ్య, సమన్వయకర్త అనిల్, సాంకేతిక ఇంజినీర్ ప్రదీప్ కుమార్ విద్యార్థులకు భారత అంతరిక్ష పరిశోధన కార్యక్రమాలు, రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల ప్రయోగ విధానం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై విలువైన అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ అంతరిక్ష రంగంలో అందుబాటులో ఉన్న వివిధ ఉపాధి, పరిశోధన అవకాశాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట భారతదేశపు ప్రధాన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి అనేక ఉపగ్రహాలు, అంతరిక్ష ప్రయోగాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి. పులికాట్ సరస్సు, బంగాళాఖాతం మధ్య ఉన్న శ్రీహరికోట భారత అంతరిక్ష కార్యక్రమం అభివృద్ధి, విజయాలలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విద్యా పర్యటనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, టి రామ పిచ్చయ్య, జె సీత, బి నాగరాజు, వి పావని, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ ఉపాధి, పరిశోధన అవకాశాల పై ప్రత్యక్ష అవగాహన లభించిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కార్యదర్శి, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్ ఈ విద్యా పర్యటన విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులను, సిబ్బందిని అభినందించారు.

# ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ 131వ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 10)
తన అద్భుతమైన రచనలతో తెలుగు సాహిత్యానికి మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు సాధించిపెట్టిన కవిశ్రేష్టుడు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 131వ జయంతి వేడుకలను సంస్కార భారతి ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీమద్రామాయణ కల్పవృక్ష కావ్యానికి జ్ఞానపీఠ్ అవార్డు సాధించి, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అవార్డు పొందిన సాహితీ దిగ్గజం విశ్వనాథ సత్యనారాయణ అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. వేయి పడగలు, ఏకవీర, కిన్నెరసాని పాటలు, మధ్యార్కరాలు రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఆస్థాన కవిగా, రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా గౌరవాన్ని పొందారని కొనియాడారు. పత్తి రామానుజకూటంలో సంస్కారభారతి జిల్లా కన్వీనర్ పత్తి రంగమన్నార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వనాథ వారి జయంతిని తెలుగు సాహితీ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. తెలుగు భాషను విద్యార్థి స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పింగళి కోదండరామయ్య, సంస్కృత కళాశాల కరస్పాండెంట్ కోటి సూర్యనారాయణ మాట్లాడుతూ మన తెలుగు జాతి కీర్తిని దిగంతాలకు చాటిని మహోన్నతులు జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ యువతరానికి చేరువకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి కార్యదర్శి ఎన్.మాల్యాద్రి, పలు సాహితీ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కెఎస్‌వి ప్రసాద్, ఓరుగంటి ప్రసాద్, రామచంద్రుని శ్రీనివాసరావు, కుర్రా ప్రసాద్‌బాబు, నేచర్ ఫౌండేషన్ రాజశేఖర్, గాయకులు ఐ మురళికృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, పింగళి పూర్ణచంద్రరావు, బనారె, గుర్రం కృష్ణ, జాలాది మోహన్, ఆనంద్, పర్వతం రాంప్రసాద్, పిన్నంరాజు నరసింహారావు, విశ్వాసేవిక ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని విశ్వనాధుని సత్యనారాయణకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు నరసింహం అభినందనీయులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 10)
పట్టణంలోని పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ భవనం నందు కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న మార్కాపురం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు టి నరసింహంను ఉమ్మడి ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. సెప్టెంబర్ 5వ తేదీ గురుపూజోత్సవం పురస్కరించుకొని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నరసింహమును పలువురు జన విజ్ఞాన వేదిక నాయకులు,కార్యకర్తలు విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి అవార్డు పొందాలని ఇంకా మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత నరసింహం మాట్లాడుతూ గత 20 సంవత్సరముల నుండి నేను పని చేసిన ప్రతి పాఠశాలను అభివృద్ధి పదంలో నడిపించడంలోనూ, మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలోనూ, విద్యార్థుల విద్యా ప్రగతి, నమోదులోనూ, విద్యార్థుల తల్లిదండ్రులతో ఉత్తమ సంబంధాలు కలిగి ఉండడం లోనూ, పాఠశాలలో జరిగే వివిధ రకాల పండుగలు ముఖ్యమైన కార్యక్రమాలను విద్యార్థులకు తెలియజేయడంలోనూ చూపిన ప్రగతి కారణంగా నాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని నా అవార్డును మా విద్యార్థులకు అంకితం చేస్తున్నానని, వయసులో నాకన్నా పెద్దలు ఎంతో ప్రేమ అభిమానాలతో తనను ఇంత గొప్పగా సన్మానించడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా, అదృష్టంగా భావిస్తూ అందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి దేవప్రసాదు, గోనె శ్రీనివాసులు, పి ఆంజనేయ చౌదరి, సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసులు, జె వెంకటేశ్వర్లు, బి కృపారావు, పిల్లి బాల నరసయ్య, పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ బాదుల్లా, షేక్ మదర్ వలి, మూసా జాని, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, మానవతా సేవా సంస్థ ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు కే ఎలమందరెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు సోమరాజు, హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ షేక్ కరీముల్లా బేగ్, టి రామారావు, తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# ర్యాగింగ్‌కు చెక్ విద్యార్థుల భద్రతే మా లక్ష్యం

## కృష్ణ చైతన్యలో ఘనంగా యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 10)




కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లోని డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం సెమినార్ హాల్‌లో గురువారం యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ర్యాగింగ్ పై అవగాహన కల్పిస్తూ, స్నేహపూర్వకమైన, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని నిర్మించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం సిఐ అల్తాఫ్ హుస్సేన్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల పై కలిగే మానసిక, సామాజిక ప్రభావాలను వివరిస్తూ, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో ప్రతి విద్యార్థి గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసంతో చదువుకునే వాతావరణం ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రంగనాయకులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. హెచ్, ఎస్ విభాగాధిపతి, ఫస్ట్ ఇయర్ ఇన్‌చార్జ్, తదితర అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ర్యాగింగ్‌కు పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేస్తూ, “గౌరవం చూపుదాం–స్నేహాన్ని పెంచుదాం–ర్యాగింగ్‌ను నిర్మూలిద్దాం” అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. విద్యార్థులు పరస్పరం సహకరించుకుంటూ, సీనియర్లు, జూనియర్లు సోదరభావంతో మెలగాలని సూచించారు. సురక్షిత విద్యకు బలమైన పునాది అనే లక్ష్యంతో కళాశాలలో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.



# కుందునది పాత బ్రిడ్జి కూలేందుకు సిద్ధం రాకపోకలు, విగ్రహాల నిమజ్జనం పై నిషేధం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 10)
పాత ఎంఎన్‌బిబి రోడ్డులో సీతారామపురం, అల్లాడుపల్లె గ్రామాల మధ్య కుందునది పై ఉన్న వంతెన అత్యంత ప్రమాదకర స్థితికి చేరింది. బ్రిడ్జి పిల్లర్లు, స్లాబులు దెబ్బతిని ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందున, దానిపై వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిషేధించారు రాబోయే వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలకు కూడా ఈ బ్రిడ్జిని ఉపయోగించరాదని రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

**100 ఏళ్ల నాటి నిర్మాణం**

లిఈ వంతెనను 1926లో బ్రిటిష్ వారి కాలంలో నిర్మించారు లివందేళ్ల నాటి ఈ వంతెన గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు, పరిమితికి మించిన అతి భారీ వాహనాల రాకపోకల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారులి.

**పోలీసులకు ఆర్అండ్‌బీ అధికారుల హెచ్చరిక...**

చాపాడు సబ్ ఇన్స్పెక్టర్ రాసిన లేఖకు స్పందిస్తూ ప్రొద్దుటూరు (సౌత్) ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం అధికారిక నివేదిక విడుదల చేశారు. ఈ బ్రిడ్జి పై ఎలాంటి ప్రయాణాలు సురక్షితం కాదని, వినాయక నిమజ్జనాల కోసం ప్రజలు ఇక్కడికి రాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని చాపాడు పోలీసులను కోరారు. ప్రజలెవరూ ఈ వంతెనపైకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశారు.

# నేడు మైదుకూరులో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 10)
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మైదుకూరు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ శాసనసభ్యులు, పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ పరిశీలకులు రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రాబోయే మున్సిపల్, పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలపై నాయకులకు, కార్యకర్తలకు ఈ సమావేశంలో వీరు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లోని వివిధ కమిటీల నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# దేవళమ్మ చెరువుకు మహర్దశ శాశ్వత తాగునీటి పరిష్కారమే ధ్యేయం

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 10)
పట్టణ పరిధిలోని దేవళమ్మ చెరువుకు మహర్దశ పట్టనున్నది. దాదాపు రూ.6 కోట్ల 60 లక్షలతో చెరువు పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మూడు దశాబ్ధాల కాలంలో కనివిని ఎరుగని రీతిలో చెరువులోని పూడికతీత పనులు, చెరువు కట్టల బలోపేతం, గ్రీనరి, వాకింగ్ ట్రాక్ వంటి పనులకు టెండర్లు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ త్వరలో పనులు ప్రారంభించనున్నది. ఈ నేపథ్యంలో గురువారం దేవళమ్మ చెరువుకు తాగునీరు తీసుకొచ్చేందుకు అవసరమై డీపీఆర్ ను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. లింగాపురం ప్రభుత్వ లే–అవుట్ వద్ద ఉన్న నాగార్జున సాగర్ కుడి కాలువను పరిశీలించారు. అక్కడి నుంచి గ్రావిటి ద్వారా తాగునీరును చెరువుకు మరలించేందుకు తగిన సాధ్యాసాధ్యాలను పర్యవేక్షించి, అధికారులకు తగు సూచనలు చేశారు. వివిధ శాఖల ద్వారా రావాల్సిన అనుమతులపై సమీక్షించారు. సమగ్ర తాగునీటి సరఫరాపై ప్రతిష్టాత్మక చర్యలు తీసుకుని, పనులు ప్రారంభించారని ఎమ్మెల్యే జూలకంటి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, డీఈ రాములు నాయక్, ఏఈ రాఘవ, టీడీపీ నాయకులు కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మందలపు రామకృష్ణ, గట్ల కోటిరెడ్డి, సుభానీ తదితరులు ఉన్నారు.



# జమ్మలమడక గ్రామంలో గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు

**– ముత్యాలమ్మ సాక్షిగా ఊరుకునే ప్రసక్తే లేదు – గ్రామోత్సవాల్లో అలజడులకు శిక్షలు తప్పవు**

**–ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం**

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 10)
జమ్మలమడక గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే ముత్యాలమ్మ తల్లి తిరుణాల సందర్భంగా గురువారం సిరిమాను ఊరేగింపులో భాగంగా గ్రామాభివృద్ధి, ప్రజా ఉన్నతికి నిర్వహించే ఉత్సవాల్లో నీచ రాజకీయాలతో అలజడులు సృష్టించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని జమ్మలమడల గ్రామంలో కొలువుదీరిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జూలకంటి, ముందుగా గర్బాలయంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శిడిమాను ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలతో మాను గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ అనేక ఆంక్షలు నడుమ తిరునాళ్లకు అనుమతులు వచ్చాయని, రాజకీయ పబ్బం కోసం పండుగ వాతావరణాన్ని పాడు చెయ్యొద్దని సూచించారు. పోలీసులకు సహకరిస్తూ, ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని సూచించారు. గ్రామానికి అపఖ్యాతి తెచ్చేలా ఎవరు ప్రవర్తించిన సహించేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com